# రాజభక్తి

గంగదేశం మీద మంగదేశం యుద్ధం ప్రకటించింది. గంగదేశపు పౌరులు రాజభక్తి గలవాళ్లు. అందుచేత వాళ్లు వీరోచితంగా యుద్ధం చెయ్యటానికి నడుములు కట్టారు.

అదీగాక మంగదేశపు రాజు మ్లేచ్ఛుడు. మంగ పౌరులలో తొంభై శాతం మ్లేచ్ఛ మతం పుచ్చుకున్నవారే. గంగ ప్రజల వీరౌచిత్యానికి అదొక ప్రధాన కారణమయింది.

చిత్రం ఏమిటంటే ఒకప్పుడు మంగరాజూ, గంగరాజూ భాయి - భాయిగా ఉండేవాళ్లు. ఆ ఇద్దరి మతౌదార్యం గురించి కవులు కవిత్వం కూడా చెప్పారు.

కాని ఇప్పుడు గంగదేశంలో మ్లేచ్ఛమత వ్యతిరేక ప్రచారమూ, మంగదేశంలో హిందూమత వ్యతిరేక ప్రచారమూ ముమ్మరంగా సాగాయి. యుద్ధకారణం ఉభయ దేశాల ప్రజలకూ తెలీదు.

యుద్ధం జరిగింది. అటూ ఇటూ నాలుగేసి వేల సైనికులు చచ్చారు.

"ఓడాం! ఓడాం!" అన్నాడు గంగరాజు

"గెలిచాం! గెలిచాం!" అన్నాడు మంగ నవాబు.

సంధి. ఇద్దరు రాజులూ ఒక డేరాలో చేరారు. విందు జరిగింది. సారా, రక్తానికి బదులుగా, ఏరులై పారింది. డేరా బయట ఉన్న కాపలా వాళ్లకి గంగరాజు బొంగురు నవ్వులూ, నవాబుగారి కీచునవ్వులూ వినిపించాయి.

సంధి షరతు: నవాబు గారి కొడుక్కు గంగరాజుగారి ఏకపుత్రికను - ఏక సంతానాన్ని - ఇచ్చి పెళ్లి చెయ్యటం.

తిరిగి మతసామరస్య ప్రచారం అయింది. రాజభక్తిని ప్రజలు గంగరాజు గారి అల్లుడి - కాబోయే గంగ నవాబు గారి - పట్ల కూడ చూపారు.

❀ ❀ ❀ ❀ ❀

"ఏమండీ, ఈ యుద్ధం ఎందుకు జరిగినట్లు?" అని మహామాత్యువారి భార్య అడిగింది.

"యుద్ధంలో ఓడకుండా గంగరాజు కుమార్తెను నవాబు కొడుక్కు ఇస్తామంటే లోకం ఆక్షేపించదుటే పిచ్చిదానా? యుద్ధం జరగాలి. కొంతమంది చావాలి. మనం ఓడి సంధి చేసుకోవాలి. సంధి షరతుకింద ఈ పెళ్లి జరగాలి. ఇదంతా మన ఏర్పాటేలే!" అంటూ అమాత్యులవారు మీసం దువ్వారు.

***ముద్రణ : యువ, మార్చ్ 1977***